నేడు సూర్యాపేట జిల్లాకు కేటీఆర్

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ వేడుకలు విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం కుత్బుల్లాపూర్‌లో ఇఫ్తార్ విందుకు హాజరవుతారు.

మద్యం బ్రాండ్లకు గడువు పెంపు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల ఉత్పత్తి, సప్లయ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 2 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేసింది. విదేశీ, దేశీయ లిక్కర్, బీరు కంపెనీలు మద్యం అమ్మకాలు జరుపుకోవడానికి టీజీబీసీఎల్‌కు 39 కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. టీజీబీసీఎల్‌లో రిజిస్టర్ కాని కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో తమ మద్యాన్ని నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్టుగా, ఎలాంటి ఆరోపణలు లేవనే నిర్ధారణ సర్టిఫికేషన్ దరఖాస్తును జత పరచాలని టీజీబీసీఎల్ కోరింది. సర్టిఫికెట్లను జతపరచడం ఆలస్యం అవుతున్నదని, గడువు ఇవ్వాలని కంపెనీలు విజ్ఞప్తి చేశాయి.

'నాటుసారాను అరికట్టండి'

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నాటుసారాను పూర్తిగా అరికట్టాలని ఎక్సైజ్ సిబ్బందికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరైక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో నాటుసారా ప్రభావం ఉన్న 25 మండలాల్లో ప్రత్యేక దాడులతో 90% అరికట్టామని, మరో నెలరోజులు స్పెషల్ డ్రైవ్‌చేసి నాటుసారా ఆనవాళ్లు లేకుండా చేస్తామన్నారు. బుధవారం ఆబ్కారీ భవన్‌లో 25 ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బందికి డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరిండెంట్ల సమక్షంలో రివార్డులను అందించారు. మార్చి 20 నుంచి ఏప్రిల్ 19వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కోరారు.

రసమయి ఇంటిపై దాడికి యత్నం

- కాంగ్రెస్ శ్రేణుల దౌర్జన్యం
- అడ్డుకున్న పోలీసులు
- పలువురు అదుపులోకి

బెజ్జంకిలో కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

తిమ్మాపూర్, మార్చి19: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నివాసంపై కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారు. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారంలోని బాలకిషన్ ఇంటిపైకి పెద్ద సంఖ్యలో నాయకులు వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. తిమ్మాపూర్ మండలం నుంచి తరలుతున్న కాంగ్రెస్ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, కొత్త తిరుపతిరెడ్డి, దావు సంపత్‌రెడ్డి, మాచర్ల అంజయ్య, కార్యకర్తలను రేణికుంట టోల్‌గేట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గంలోని బాధితులకు ఇవ్వాల్సిన సీఎంఆర్ఎఫ్‌లో రూ.6కోట్ల స్కాం చేశారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇటీవల ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో ఆరోపణలు నిరూపించాలంటూ బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి మండలం గుండారంలోని రసమయి ఇంటిపై దాడికి యత్నించారు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

భయపడను ప్రశ్నిస్తూనే ఉంటా..

కవ్వంపల్లి సత్యనారాయణ చేసే కమీషన్ల పాలనపై ప్రశ్నిస్తూనే ఉంటానని, ఎవరికీ భయపడేదేలేదని గుండారంలోని తన ఇంటిలో హౌస్ అరెస్ట్ అయిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఒక వీడియో సందేశాన్ని కార్యకర్తలకు విడుదల చేశారు. పెద్దలింగాపూర్‌లోని రైతులు నీళ్లు రాక ధర్నా చేస్తుంటే, కవ్వంపల్లి రంగులు పూసుకుంటున్నాడని ఇటీవల మాట్లాడినందుకు కార్యకర్తలతో తన ఇంటిపై దాడిచేసేందుకు కుట్రకు తెరలేపారని మండిపడ్డారు.

హరీశ్‌రావు ఖండన

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అవినీతిని ప్రశ్నిస్తే కార్యకర్తలను, అనుచరులను ఉసిగొల్పి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపైకి దాడి చేసే పన్నాగం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. ఈ మేరకు సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. రసమయి బాలకిషన్ భద్రతకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కవ్వంపల్లి దిష్టిబొమ్మ దహనం

రసమయి బాలకిషన్ ఇంటిపై దాడికి యత్నించిన కాంగ్రెస్ చర్యకు నిరసనగా బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ ఆధ్వర్యంలో నుస్తులాపూర్ స్టేజీ వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మ దహనం చేశారు. కవ్వంపల్లి ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు.

హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం, ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, మార్చి 19: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కుట్టు మిషన్లు అందజేస్తున్నామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. పోచంపల్లి ఫౌండేషన్, ఏపీఎల్ హెల్త్ కేర్ ఆర్థిక సాయంతో సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ వారి నిర్వహణలో మహిళలకు గతంలో ఉచిత శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో వారికి బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరై 378 మంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేశారు.

'మహాలక్ష్మి' ప్రయాణానికి కోత

- ఏడాదికి రూ.4,800 కోట్లు అవసరం
- కేటాయింపులు రూ.3,084 కోట్లే
- రూ.10 వేల కోట్లు ఇవ్వండి
- ఆర్టీసీ సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకం కింద అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికీ బడ్జెట్‌లో కొర్రీలు పెట్టారు. మహాలక్ష్మి పథకంలో ఇస్తున్న జీరో టికెట్ల విలువ నెలకు రూ.400 కోట్లు కాగా.. ఏడాదికి రూ.4,800 కోట్లు అవసరం. అయితే, బడ్జెట్‌లో కేవలం రూ.3,084 కోట్లు అంటే నెలకు రూ.256 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి మరో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పినా నెలకు మొత్తంగా రూ.340 కోట్లు మాత్రమే అవుతున్నాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకునేదెవరని ఆర్టీసీ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే బడ్జెట్ సవరించి ఆర్టీసీకి మొత్తం రూ.10 వేల కోట్లు కేటాయించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు డిమాండ్ చేశారు. ఆర్టీసీలో బస్సులు పెంచామని, 6,400 కొత్త ఉద్యోగాలు ఇచ్చామని ఏ ప్రాతిపదికన చెప్తున్నారో ఆర్థిక మంత్రి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 15 నెలల కాలంలో 3,500 మంది కార్మికులు రిటైర్ కాగా, ఒక్కరిని కూడా కొత్తగా నియమించలేదని వారు స్పష్టం చేశారు. విద్యుత్తు బస్సులు తీసుకొచ్చి, ఇప్పటికే ఉన్నవారినే ఇంటికి పంపే కేంద్ర ప్రభుత్వ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతున్నదని ఆరోపించారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తేతెలంగాణ) : పర్యావరణ పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీని దొడ్డి దారిన ప్రైవేటీకరించేందుకే ఎలక్ట్రికల్ బస్సులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'ఆర్టీసీని పరిరక్షిద్దాం– ప్రజా సేవను కొనసాగిద్దాం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీ ఎస్ బోస్, ఎమ్మెల్సీలు కోదండరామ్, నెల్లికంటి సత్యం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ జీ నరసింహారావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, ఆర్టీసీ జేఏసీ చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ వెంకన్న, కో చైర్మన్, థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రేవంత్ తీరనిద్రోహం

- ఎస్సీ వర్గీకరణ ఖాళీ కొబ్బరి చిప్పతో సమానం
- ఓవర్గంతో కుమ్మక్కై మాదిగలకు మోసం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, మార్చి 19: ఎస్సీ వర్గీకరణతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగ నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అనేది ఉత్త ఖాళీ కొబ్బరిచిప్పతో సమానమని ఎద్దేవా చేశారు. ఉత్త చిప్పను మాదిగలకు ఇచ్చి, ఉద్యోగాలన్నీ మరో వర్గానికి కట్టబెట్టారని ధ్వజమెత్తారు. వర్గీకరణను వర్తింపజేయకుండానే ఉద్యోగాలన్నీ భర్తీచేస్తే మాదిగ నిరుద్యోగ యువతకు చేసేందేమీ లేదని చెప్పారు. వర్గీకరణ చట్టం చేయక ముందే సీఎం హడావుడిగా గ్రూప్ 1, 2, 3, ఇతర శాఖల్లోని ఉద్యోగ నియామకాలు చేపడుతూ, ఉద్యోగ అవకాశాలన్నీ ఒక వర్గానికే దోచిపెడుతున్నారని ఆరోపించారు. మంత్రి రాజనర్సింహతో రాజీపడి ఒక్క వర్గానికే అన్ని ఉద్యోగాలు కట్టబెడుతున్నారని చెప్పారు. మాల, మాదిగల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించలేకపోయారని, కనీసం రెండు వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులను కూర్చోబెట్టి మాట్లాడించలేకపోయారని ఆరోపించారు.

సోలార్‌మయంగా నియోజకవర్గానికో గ్రామం!

బడ్జెట్‌లో రూ. 1,500కోట్లు కేటాయింపు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఎంపిక చేసిన గ్రామాలను సోలార్‌మయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, బడ్జెట్‌లో 1,500కోట్లు కేటాయించింది. ఈ నిధులతో గ్రామాలను పూర్తిగా సోలార్ విద్యుత్తు వ్యవస్థతో అనుసంధానిస్తారు. గ్రీన్ పవర్ వినియోగించే గ్రామాలుగా అవతరిస్తాయి. ప్రతి నియోజకవర్గంలోని ఒక గ్రామాన్ని పూర్తి సోలార్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి, మధిర నియోజకవర్గంలోని ఓ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికచేశారు.

సబ్సిడీ 11వేల కోట్లు.. లోటు 20వేల కోట్లు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ సంస్థలపై సర్కారు కరుణచూపలేదు. ఆర్థికశాఖకు, ఇంధనశాఖకు మంత్రి భట్టి విక్రమార్క ఉన్నా కూడా డిస్కంల ఆశలు అడియాశలే అయ్యాయి. బడ్జెట్‌లో సబ్సిడీగా రూ. 11,500కోట్లు కేటాయించారు. గతేడాది సబ్సిడీ కింద రూ. 11,500కోట్లే కేటాయించారు. ఈ సారి సబ్సిడీని రూపాయి కూడా పెంచలేదు. రాష్ట్రంలో రెండు విద్యుత్తు సంస్థలు రూ. 20వేల కోట్ల లోటులో ఉన్నాయి. విద్యుత్తు చార్జీలను పెంచవద్దని, లోటును పూడుస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నది. కానీ లోటును పూడ్చడంలో మొండి చెయ్యి చూపిస్తున్నది.

నాకంటే కిషన్‌రెడ్డిపైనే మందకృష్ణకు నమ్మకం

ఎస్సీ ఉపకుల సంఘాల అభినందన సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 19 (నమస్తేతెలంగాణ): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ.. తనకంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే ఎక్కువగా నమ్ముతారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రిని బుధవారం ఎస్సీ సంఘాల నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎస్సీ సంఘాల నేతలు పాల్గొని సీఎంకు ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

లొంగిపోయిన మావోలకు అండగా ఉంటాం

ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్

లొంగిపోయిన మహిళా మావోయిస్టుకు రివార్డును అందిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగురూరల్, మార్చి19: లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రివార్డు డీడీలను అందజేసి మాట్లాడారు. సరెండర్ రిహాబిలిటేషన్‌లో భాగంగా ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యురాలు అలువ స్వర్ణకు రూ. 4లక్షలు, సెంట్రల్ కమిటీ సభ్యుడు దివంగత కటకం సుదర్శన్ భార్య డీవీసీఎం సభ్యురాలు పులుసం పద్మకు రూ. 5లక్షల డీడీలను అందించినట్టు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

శ్రీనివాస్(ఫైల్)

మహబూబ్‌నగర్, మార్చి 19 : ఆర్థిక ఇబ్బందులతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఏఆర్ కానిస్టేబుల్ ఆకుల శ్రీనివాస్ (38) విధులు నిర్వహిస్తూ గౌడ్స్ కాలనీలో భార్య మమత, కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గతేడాది డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా.. చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడినట్టు తెలిసింది. ఆరో గ్యం సరిగాలేకపోవడం .. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ మంగళవారం రాత్రి అద్దె ఇంట్లో భార్య, కుటుంబ సభ్యులు నిద్రపోయిన తర్వాత తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం లేచి చూసిన కుటుంబ సభ్యులు గది తలుపులను పగులగొట్టి పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. కానిస్టేబుల్‌కు ఒక బాబు ఉన్నాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సిరికొండ, మార్చి 19: మోటర్ స్టార్టర్ రిపేర్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి ఓ రైతు దుర్మరణం చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పందిమడుగు దూప్యతండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన రైతు మలావత్ రమేశ్ (45)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన.. మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. మోటర్ నడవడం లేదని గుర్తించి స్టార్టర్ మరమ్మతులు చేస్తుండగా, విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతూ పొలానికి వెళ్లగా, అక్కడ రమేశ్ విగతజీవిగా కనిపించాడు.

ఆకాశ్ డిజిటల్ శిక్షణతో ఫలితాలు మెరుగు

ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సీఈవో, ఎండీ దీపక్ మెహ్రోత్ర వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : మెడికల్, జేఈఈ, ఇంజినీరింగ్ వంటి పోటీ పరీక్షలకు మెరుగ్గా సన్నద్ధమయ్యేలా ఆకాశ్ ఎడ్యుకేషన్ సంస్థ 'ఆకాశ్ డిజిటల్ ప్లాట్‌ఫాం'ను ప్రారంభించిందని, దీంతో టెస్ట్ ప్రిపరేటరీ సర్వీసెస్‌లో జాతీయ అగ్రగామిగా నిలిచిందని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ మెహ్రోత్ర వెల్లడించారు. ఆకాశ్ 2.0 వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా ప్రత్యేకమైన డిజిటల్ ఆఫర్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. అన్ని ఆకాశ్ మెటీరియల్స్ ఒకే వేదికపై డిజిటల్ స్పేస్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నీట్, జేఈఈ, ఒలింపియాడ్ కోసం కోచింగ్‌ను అందించే ఆన్‌లైన్ లెర్నింగ్, ఆల్–పవర్డ్ ఇంటరాక్టివ్ ప్లాట్‌ఫాం.. ఆకాశ్ అనికొనియాడారు. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యార్థులు వారి ఇండ్ల నుంచే కోచింగ్‌ను పొందేలా ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్స్, నిపుణుల మార్గదర్శకత్వం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఆకాశ్ డిజిటల్ 2.0 బీటా వెర్షన్‌ను ఏడాది క్రితం ప్రారంభించామని.. అద్భుతమైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. దేశంలోని మారుమూల ప్రాంతాల విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని, నీట్, జేఈఈలో ప్రతిభ కనబరిచారని వెల్లడించారు.

పసిపిల్లలను అమ్మేసే ముఠా గుట్టురట్టు!

I తరువాయి...

వెల్లడించారు. కీలక నిందితురాలైన అమూల్యతోపాటు ఆమెకు సహకరించిన మహారాష్ట్రకు చెందిన వైశాలి భీమ్‌రావు వాస్నిక్, హైదరాబాద్‌కు చెందిన జన్‌పల్లి కార్తీక్, సజ్జన్ అగర్వాల్, బానాల మంగయ్య, రఘురామ్ అశోక్, షేక్ ఇస్మాయిల్, మాచర్ల వంశీకృష్ణ, ఆసిఫాబాద్‌కు చెందిన బోదాస్ నాగరాజుతో పాటు పిల్లలను కొనుగోలు చేసిన 27 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కోల కృష్ణవేణి, దీప్తి ముఠా గజరాత్‌కు చెందిన వందనతో కలిసి పసిపిల్లలను విక్రయిస్తున్నట్టు గుర్తించినట్టు సీపీ తెలిపారు. ఈ ముఠాలోని ముగ్గురు ప్రధాన నిందితులను విచారించగా వేర్వేరు నెట్‌వర్క్‌ల సమాచారం లభించిందని వివరించారు. దాని ఆధారంగా పసిపిల్లల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు విస్తరించిన ఈ నెట్‌వర్క్ గురించి ఆరా తీసి తాజాగా 16 మందిని కాపాడామని తెలిపారు. తొలుత హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన ఆశ వర్కర్ అమూల్య, మలక్‌పేట్ ఏరియా దవాఖానలో సూపర్‌వైజర్ ఇస్మాయిల్ కలిసి పిల్లల విక్రయాలకు తెరలేపారని తెలిపారు. అమూల్య బంధువైన చౌటుప్పల్‌కు చెందిన పిల్లలులేని సుగుణమ్మకు మగపిల్లవాడిని విక్రయించారని, అందులో రూ.30 వేల చొప్పున ఇద్దరూ పంచుకున్నారని తెలిపారు. అమూల్యకు కృష్ణవేణి, దీప్తి టీమ్‌తో పరియం ఏర్పడిందని వివరించారు. మొదట ఒకటి, రెండుసార్లు ముగ్గురూ కలిసి పిల్లలను విక్రయించారని, ఆ తర్వాత కృష్ణవేణి, అమూల్య, దీప్తి వేర్వేరుగా విక్రయిస్తూ తమ సొంత నెట్‌వర్క్‌లను ఏర్పరుచుకున్నారని వివరించారు.

సహాయక చర్యలు వేగవంతం

అచ్చంపేట, మార్చి 19 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 26 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు వేగవంతం చేశారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ ప్లాట్‌ఫాం కత్తిరింపు, ఎస్కవేటర్ల ద్వారా మట్టి తొలగింపు, నీటి తోడివేతలే చేపట్టారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ టన్నెల్ ఆఫీస్ వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు.

మంత్రుల ముఖాలు మాడిపాయే!

- రెండో రోజూ ఆన్ కాని దేవాదుల మోటర్లు
- మంత్రుల హడావుడితో అధికారుల తిప్పలు
- మరో మూడురోజులు పడుతుందని అంచనా!

వరంగల్, మార్చి 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంత్రుల హడావుడితో ఆన్ కాలేకపోయిన దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పంపుల పరిస్థితి ఇంకా అలాగే ఉన్నది. బుధవారం రాత్రి వరకు పంపులు ఆన్ కాలేదు. మరో రెండు రోజుల వరకు పంపులు ఆన్ అయ్యే పరిస్థితి లేదని సాగునీటి శాఖ అధికారులు చెబుతున్నారు. దేవాదుల ప్రాజెక్టు మూడో దశలోని దేవన్నపేట పంప్‌హౌస్‌లో మోటర్లను ఆన్ చేసేందుకు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం వచ్చారు. ఆన్ కాకపోవడంతో మోటర్లు ఆన్ అయ్యే వరకు వరంగల్‌లోనే ఉంటామని, ఆన్ చేసిన తర్వాతే వెళ్తామని ప్రకటించారు. రాత్రి 12 గంటల వరకు నిట్ గెస్ట్ హౌస్‌లో ఉన్నారు. పంపులు ఆన్ అయ్యే పరిస్థితి లేకపోవడంతో చేసేది లేక హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మంత్రులు హైదరాబాద్‌కు వెళ్లడంతో సాగునీటి శాఖ అధికారులు పంపులను ఆన్ చేసే ప్రక్రియ నెమ్మదించింది. దేవన్నపేట పంపుహౌస్‌లోని మోటర్లు ఎప్పటి వరకు ఆన్ అవుతాయనేది సాగునీటి శాఖ అధికారులే చెప్పలేకపోతున్నారు. మంత్రులు అడిగినందుకు రెండుమూడు రోజులు అని చెప్పామని, సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తేనే మోటర్లు ఆన్ అవుతాయని అంటున్నారు. సాగునీటి సరఫరా వ్యవస్థపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి దేవన్నపేట పంపుహౌస్ మోటర్ల ప్రారంభ ప్రక్రియ పెద్ద ఉదాహరణగా నిలిచింది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు పంటలకు సాగునీరు అందించేందుకు దేవన్నపేట పంప్‌హౌస్ మోటర్లను ఆన్ చేయాల్సి ఉన్నది. పంపులను రన్ చేసే విషయంలో సాగునీటి శాఖ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేయకుండానే నేరుగా మంత్రులు రావడం వింతగా ఉన్నది. మంత్రులు వచ్చి మోటర్లు ఆన్ చేస్తే పంటలు పండుతాయని ఆశించిన రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద రామప్ప చెరువు నుంచి ఉనికిచర్ల వరకు టన్నెల్, దేవన్నపేట పంప్‌హౌస్ పనులను రూ.1494 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసింది. దేవన్నపేట పంప్‌హౌస్‌తో కొత్తగా 60 వేల ఎకరాలు పారడంతోపాటు రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనున్నది. జనగామ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఆయకట్టుకు దేవన్నపేట పంప్‌హౌస్‌తో సాగునీరు అందనున్నది. మంత్రులు ఉత్తమ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హడావిడితో దేవన్నపేట పంప్‌హౌస్ మోటర్ల